# 10. నవాబుగారూ - నమ్మినబంటూ

ప్రపంచ ప్రసిద్ధ పిసునుగొట్టు ధనికుడు ల్యూటినెంట్. జనరల్, హిజ్ ఎక్జాల్టెడ్ హైనెస్, అసఫ్‌జా ముజఫర్ ఉల్‌ముల్క్, నిజాం ఉద్దౌలా, సర్‌మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్, ఫతేజంగ్ అనబడే నిజాం నవాబుగారి నేలమాళిగలో గల స్వర్ణ, రత్న, మణిమాణిక్యాదుల విలువ ఎంతో లెక్కగట్టిన వారే లేరు.

కానీ, నవాబుగారి ధనదాహం వారి వయసుతోపాటు పెరుగుతూ వచ్చిందేగాని తరగలేదు. ఆ మహాపురుషుడు అత్యంత నిరాడంబరంగా బ్రతికేవాడు. చివరికి వారికి అత్యంత ప్రియమైన ధూమపానం విషయంలో కూడా పొదుపుగానే ఉండేవారు.

నవాబుగారు ఛైన్‌స్మోకర్, అగ్గిపుల్లతో పనిలేకుండానే సిగరెట్ మీద సిగరెట్ తగలేసేవారు, అయినా వారు కనీసం ఓ ఆష్‌ట్రేనయినా వాడేవారుకారు. పైగా హైదరాబాదులోనే తయారయే అత్యంత చౌకరకం సిగరెట్ చార్మినార్‌నే వాడేవారు.

ఓసారి భారత ప్రభుత్వ సలహాదారుగానున్న వి. పి. మీనన్ గారేదో రాచకార్యంపై నవాబుగారి దర్శనం చేసుకోగా నవాబుగారు యీ చార్మినార్ సిగరెట్‌నే వారికి ఆఫర్‌చేశారు. కాని, మీనన్ మహాశయుడు మర్యాదగా వెంటనే తన జేబులోంచి తాను వాడే ఖరీదయిన అమెరికన్ సిగరెట్ల పాకెట్ తీసి నవాబుగారికి ఆఫర్ చేశారు.

అప్పుడు నవాబుగారు సంతోషించి ఒకటికి బదులు నాలుగు

సిగరెట్లు ఆ ప్యాకెట్ నుండి తీసుకుని తన సిగరెట్ కేసులో భద్రపరచుకుని యధావిధిని తన చార్మినార్ త్రాగసాగేరు.

మరికొద్ది రోజుల తదుపరి సదరుమీనన్‌గారు మరేదో రాచకార్యం మీద నవాబుగారిని దర్శించుకోగా, శ్రీవారు తక్షణం వారికి ఖరీదయిన అమెరికన్ సిగరెట్టొకటి ఆఫర్ చేశారట. మీనన్‌గారు అది వారంరోజుల క్రితం నవాబుగారు తన సిగరెట్ ప్యాకెట్ నుండి తీసుకున్న నాలుగులోనూ ఒకటని గుర్తించగానే పాపం దాదావు మూర్ఛపోయారట.

నవాబుగారు నగరంలో ఎవరిదేనా కొత్తకారు కనిపిస్తే ముచ్చటపడిపోయేవారట. దాంట్లో సవారీ చేయాలని. వారి సరదా చూసి వారి అంతరంగికులు తక్షణం ఆ కారు ఓనరుకు కబురంపేవారు. ఆ ఓనరేమో తన జన్మ ధన్యమైందని సంతోషించి మరుక్షణం తన కొత్తకారు శుభ్రంగా కడిగించి మరీ నవాబుగారి సవారీకోసం పంపేవాడు?

కానీ, ఆ కారు మాత్రం నవాబుగారి సరదా తీరగానే సరాసరి శ్రీవారి గారేజీలోకే పయనించి అక్కడనే బైఠాయించేది. తన కారు పంపమని అడగలేక ఆ పెద్దమనిషి చచ్చినట్టు ఆశవదులుకొని ఈ సారి ఓ డొక్కు కారేదో కొనుక్కునేవాడు. ఈ విధంగా నవాబుగారు సునాయాసంగా ఓ నాలుగు వందల కార్లతో తన గారేజీని నింపిపారేశారు.

నవాబుగారు డబ్బు పోగుచేసేందుకు అనేక మార్గాలను కనిపెట్టారు. వారు అడపా తడపా చిన్న సైజు విందులు చేసేవారు. ఆ విందుల్లో ముందే నిర్ణయించుకొన్న ప్రకారం ప్రత్యేకించి ఓ అరడజను మంది జాగీర్‌దార్లకు, ధనికులకు ఓ గ్లాస్ ఛాంపేన్ స్వయంగా అందించేవారు. వారేమో నవాబుగారు తమ పట్ల చూపిన గౌరవానికి ఉబ్బిపోయి మరుసటి ఉదయం కృతజ్ఞతా పురస్కారంగా తలా ఓ లక్ష రూపాయలు

నవాబుగారికి నజరానాగా పంపేవారు. నవాబుగారు దీన్నో సదాచారంగా మార్చిపారేశారు.

అలాగే శ్రీవారు వివాహాది శుభకార్యాలకు వేటికయినావెడితే వారేమీ బహుమతులిచ్చేవారుకాదు. పైగా ఆ ఉత్సవం జరుపుకుంటున్నవారే నవాబుగారి రాకకు కృతజ్ఞతా సూచకంగా విలువైన కానుకలను శ్రీవారికి సమర్పించుకునేవారు.

ఇంతాచేస్తే నవాబుగారి సంస్థానం ఇంగ్లండుకన్నా పెద్దది వైశాల్యంలో. ఆదాయమా అపరిమితంగానే ఉండేది. మంచి ఆదాయం తెచ్చిపెట్టే ప్రాంతాల్లో నవాబుగారికి బీరార్ ముఖ్యమైనది.

అందుకే బ్రిటిష్‌వారి కళ్ళు బీరార్ మీద పడ్డాయి. ఆ ప్రాంతం తమ అదీనంలో ఉండటం రాజకీయంగా కూడా వారికి అవుసరమయింది.

కనుక

లార్డ్‌కర్జన్ వైస్రాయిగా ఉన్న సమయంలో, ఎలాగైనా బీరార్ మీద హక్కులు సంపాదించమని అతను హైదరాబాద్‌లోనున్న తమ రెసిడెంటును వత్తిడిచేశాడు.

అప్పుడా రెసిడెంట్ నడుం బిగించి ఓ సుదినాన నవాబ్‌గారిని తన చాకచక్యంతో చిత్తుచేసి ఎలాగైతేనేం బీరార్‌ను బ్రిటిష్ వారికి ధారాదత్తం చేస్తున్నట్లు నవాబుగారి చేత ఓ ఫర్మానా వ్రాయించుకుని, సంతకం చేయించుకుని, రెసిడెన్సీకి పోయి చిత్తుగా త్రాగి మత్తుగా నిద్రపోయేడు.

మర్నాడుదయం నవాబుగారి ప్రధాన మంత్రి మహారాజా సర్ కిషన్‌ప్రసాద్ ఈ సంగతి విని దాదాపు మూర్ఛపోయేరు. బీరార్ లేకుంటే తమ సంస్థానానికి ప్రాముఖ్యతే ఉండబోదనే రాజకీయ రహస్యాన్ని నవాబుగారికి బోధపరిచేడు

విని నవాబుగారు చింతించేరు తన తొందరపాటుకు.

కానీ, అప్పటికే కాలాతీతమయి పోయింది అయినా ఎలా గోలా ఆ ఖరారునామా పత్రాన్ని రెసిడెంటు నుండి సంపాదించి తీరమని మహా మంత్రిని ఆజ్ఞాపించేరు.

ప్రధానమంత్రి గారున్నూ దీర్ఘంగా, సుదీర్ఘంగా ఆలోచించేరు.

సరాసరి రెసిడెంటు భవనానికి పోయి రెసిడెంట్‌గారి దర్శనం చేసుకున్నవారై, సదరు దానపత్రాన్ని తానోసారి చూసి ధృవీకరించవలసి ఉందని విన్నవించుకున్నారు.

ఆ దాన పత్ర ప్రతినొకదానిని తాను వ్రాసుకుని రికార్డులో భద్ర పరచవలసిన అవుసరముందనే భావాన్నాయన రెసిడెంటుకు కలిగించేరు.

రెసిడెంటున్నూ భద్రంగా ఆ దానపత్రాన్ని తెచ్చి విజయగర్వంతో, చిరుదరహాసంతో మహారాజా సర్ కిషన్‌ప్రసాద్‌జీ వారి చేతుల్లో ఉంచేరు.

మరుక్షణం మహామంత్రిగారు ఆ పత్రాన్ని రెండుచేతుల్తోనూ నలిపి ఉండలా చేసి భక్తి ప్రపత్తుల్తో రెసిడెంటుగారు కన్నుమూసి తెరిచే లోగా లటుక్కున నోట్లోవేసుకుని, గుటుక్కున మ్రింగివేసారు.

రెసిడెంటుగారు తెల్లముఖం వేసుకుని దాదాపు మూర్ఛావస్థలో వుండగా మహామంత్రిగారు శుభ్రంగా కారెక్కి కోఠీకి వెళ్ళిపోయేరు.

వెళ్ళిన మహారాజా సర్ కిషన్‌ప్రసాద్ వారికి ల్యూటినెంట్ జనరల్, హిజ్‌ఎక్జాల్టెడ్‌హైనెస్, ఆసఫ్‌జా ముజాఫర్ ఉల్ ముల్క్, నిజాం ఉల్‌ముల్క్, నిజాం ఉద్దౌలా, సర్‌మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహ దూర్ ఫతేజంగ్ వగైరా, వగైరాగారు సగౌరవంగా ఓ అరగ్లాసుడు ఛాంపేన్‌ను స్వయంగా అందించారు.

★